


# ఏయూ లుక్స్

తెలుగు వార పత్రిక

ఆంధ్ర విశ్వవిద్యాలయం, విశాఖపట్నం ఆంధ్రప్రదేశ్

ANDHRA UNIVERSITY
Accredited by NAAC With 'A' Grade
ISO 2001:2015 Certified

aulooks@andhrauniversity.edu.in
aulooksvizag2019@gmail.com
ఫోన్: 0891-2844000

OCTOBER 08 - 14, 2023

Chief Patron : Prof. P.V.G.D. Prasad Reddy | Chief Editor Prof. K.Samatha | Publisher : Prof. V.Krishna Mohan

సంపుటి : 2 | సంచిక : 87 | పేజీలు : 8


రాష్ట్ర ఉన్నత విద్యాసంస్థలకు

# ఏయూ ఆదర్శం

**ఎన్ఐఆర్ఎఫ్‌లో అత్యుత్తమ ప్రతిభపై యాప్సీ హర్షం**

**నాలుగు విభాగాల్లో ఏయూకు పురస్కారాలు ప్రధానం**

**రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్‌ను సత్కరించిన మంత్రి బొత్సా**



**ఏయూ న్యూస్, అక్టోబర్ :** ఉన్నత విద్యా ప్రమాణాలు, నూతన సంస్కరణలకు విషయంలో రాష్ట్రంలోని ఉన్నత విద్యాసంస్థలన్నింటికీ ఆంధ్రవిశ్వవిద్యాలయం ఆదర్శంగా నిలుస్తోందని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. ఇటీవల విజయవాడలో ఉన్నత విద్యశాఖ నిర్వహించిన ఓ ప్రత్యేక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. జాతీయ స్థాయిలో కేంద్ర విద్యాశాఖ ప్రకటించే ఎన్ఐఆర్ఎఫ్ ర్యాకింగ్స్‌లో రాష్ట్రం నుంచి ఏయూ నాలుగు విభాగాల్లో అత్యుత్తమ స్థానాలు సాధించడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఓవరాల్ విభాగంతో పాటు కళాశాలల విభాగంలో ఏయూ ఫార్మశీ కళాశాల, ఏయూ ఇంజనీరింగ్ కళాశాల, స్టార్టప్ ఇంక్యుబేషన్ విభాగంలో ఏయూ ఆ-హబ్ మంచి ర్యాంకులు సాధించి అవార్డులు సొంతం చేసుకోవడం హర్షణీయమన్నారు. వాటికి సంబంధించిన ప్రశంసా పత్రాలను, జ్ఞాపికలను ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎమ్.జేమ్స్ స్టీఫెన్‌కు బొత్సా అందజేసి ఆయన్ని సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య కె.హేమచంద్రారెడ్డి, వైస్ ఛైర్మన్ ఆచార్య రామ్మోహనరావు, ఏయూ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య జి.శశిభూషణరావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో

# ఏయూకి 9వ స్థానం

**ఏయూ న్యూస్, అక్టోబర్:** ఉన్నత విద్య కోసం విదేశాలకు వెళ్లే విద్యార్థుల కేటగిరిలో ఆంధ్రవిశ్వవిద్యాలయాని కి జాతీయ స్థాయిలో 9వ స్థానం లభించింది. దేశంలోని విశ్వవిద్యాలయాల నుంచి అమెరికాకు ఉన్నత చదువులు కోసం వెళుతున్న విద్యార్థుల సంఖ్య పై ఇటీవల ఓ సంస్థ సర్వే నిర్వహించగా ఏయూ జాతీయస్థాయిలో 9వ ర్యాంకును కైవసం చేసుకుంది. ఈ సర్వేలో రాష్ట్రస్థాయిలో ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రథమ స్థానంలో నిలిచి సత్తా చాటింది. ఏయూలో యూజీ విద్యను పూర్తి చేసి పీజీ విద్యను అభ్యసించడానికి అమెరికాకు 583 మంది విద్యార్థులు వెళ్లినట్లు ఈ సర్వే ద్వారా ఆ సంస్థ పేర్కొంది. ఈ సర్వేలో రాష్ట్రానికి చెందిన ఏఎన్ యూ 13వ స్థానంలోనూ , ఎస్వీ యూనివర్సిటీ 18వ స్థానంలోను నిలిచాయి. ఈ సందర్భంగా పలువురు రాష్ట్ర ప్రతినిధులు ఏయూ ఖ్యాతిని కొనియాడగా... వర్సిటీ వర్గాలు హర్షం వ్యక్తం చేశాయి.

# ఏయూను సందర్శించిన ఆరోగ్య వర్సిటీ వీసీ




**ఏయూ న్యూస్, అక్టోబర్:** ఆంధ్రవిశ్వవిద్యాలయాన్ని డాక్టర్ వై.ఎస్.ఆర్. ఆరోగ్య విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య డాక్టర్ కె.బాబ్జీ ఇటీవల సందర్శించారు. ఈ సందర్భంగా ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డితో ఆయన సమావేశమయ్యారు. ఏయూలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వీసీ ప్రసాద రెడ్డి ఈ సందర్భంగా ఆయనకు వివరించారు. అనంతరం వీసీ ఆచార్య కె.బాబ్జీ మాట్లాడుతూ ఆంధ్రమెడికల్ కళాశాల విద్యార్థిగా ఉన్న సమయంలో ఏయూతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. అనంతరం ఏయూ తరపున ఆచార్య బాబ్జీని ఏయూ వీసీ ఆచార్య ప్రసాద రెడ్డి సత్కరించి, జ్ఞాపికను బహూకరించారు. అనంతరం ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్‌తో సమావేశమైన వీసీ ఆచార్య బాబ్జీ ఆయన్ని సత్కరించి నూతనంగా రిజిస్ట్రార్‌గా నియమితులు కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.




# ఆక్వా నైపుణ్యంతో భవితకు బాటలు

వివరాలు 2,3లో

ఎమ్.పద్మకుమారి
ఏయూ జర్నలిజం విభాగ సీనియర్ విద్యార్థిని

**అవంతి ఫీడ్స్ లిమిటెడ్‌తో కలిసి ఆంధ్ర విశ్వవిద్యాలయం కార్యాచరణ**

**ఏయూ విద్యార్థుల్లో నైపుణ్యం పెంచేందుకు ప్రత్యేక సెంటర్**

**మంచి ఫలితాలను అందిస్తున్న శిక్షణ**

**వందల మంది వర్సిటీ విద్యార్థులకు ఉన్నత ఉద్యోగాలు**

ప్రస్తుతం ప్రపంచం ఎదర్కొంటున్న అతిపెద్ద సమస్య నిపుణుల కొరత. గ్లోబలైజేషన్ కారణంగా అంతర్జాతీయంగా యువతకు అనేక ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తున్నా నైపుణ్యలేమి కారణంగా వాటిని అందిపుచ్చుకోలేని పరిస్థితి. ఈ సమస్య కేవలం ఏ ఒక్క రంగానికో పరిమితం కాలేదు. ఐటీ, ఇన్ఫ్రాస్ట్రక్చర్, వ్యవసాయం, సేవా రంగం ఇలా అన్నింటా ఇదే పరిస్థితి. అయితే ఈ పరిస్థితిని అదిగమిస్తూ విద్యార్థులను నైపుణ్యం దిశగా నడిపించే గురుతర బాధ్యత ఉన్నత విద్యాసంస్థలపై ఉండటంతో ఆ దిశగా ఆంధ్రవిశ్వవిద్యాలయం భవిష్యత్ విజన్‌తో ముందడుగు వేసింది. గత నాలుగేళ్లుగా ఇంజినీరింగ్, సైన్స్, ఆర్ట్స్ విద్యార్థుల్లో నైపుణ్యం పెంచేందుకు అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా అవంతి ఫీడ్స్ లిమిటెడ్ సహకారంతో ప్రపంచ వ్యాప్తంగా అక్వారంగంలో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకునేందుకు " ఏయూ - అవంతి ఆక్వా కల్చర్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ " పేరిట ప్రత్యేక నైపుణ్య శిక్షణా కేంద్రాన్ని అందుబాటులోకి తెచ్చింది. ఆ సెంటర్ ద్వారా విద్యార్థులకు పెద్ద ఎత్తున అక్వారంగానికి అవసరమైన నైపుణ్యాన్ని అందించడంతో పాటు వారికి ఉన్నత ఉద్యోగ అవకాశాలే లక్ష్యంగా సేవలందిస్తోంది. ఈ నేపథ్యంలో ఆ సెంటర్ గత కొన్నేళ్లుగా అందిస్తున్న సేవలపై ఏయూ లుక్స్ ప్రత్యేక కథనం.

# ఆక్వా నైపుణ్యంతో భవితకు బాటలు




## సెంటర్ ప్రారంభం ఇలా..

2021లో ఆంధ్రవిశ్వవిద్యాలయం అవంతి ఆక్వా కల్చర్ స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ పేరుతో అవంతి ఫౌండేషన్ సహకారంతో ప్రారంభించారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఈ సెంటర్‌ను వర్చ్యువల్ గా ప్రారంభించారు. ఈ సెంటర్ ద్వారా అక్వాకల్చర్ రంగంలో విద్యార్థులను నైపుణ్య వంతులుగా తీర్చిదిద్దాలన్నదే ఈ సెంటర్ ప్రధాన లక్ష్యంగా. గత కొన్నేళ్లుగా ఆక్వా-కల్చర్ పరిశ్రమ దేశం యొక్క ఆర్థిక స్థిరత్వాన్ని కాపాడుకోవడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ముఖ్యంగా అమెరికన్ , ఐరోపా దేశాలకు సముద్ర ఆహారాన్ని ఎగుమతి చేయడం ద్వారా గణనీయమైన విదేశీ మారకద్రవ్యం సాధించడం ద్వారా దేశ ఆర్థిక పురోగతికి బాటలు వేస్తోంది. అయితే విద్యావంతులు , సుశిక్షితులైన నిపుణుల కొరత ఈ రంగానికి పెద్ద సవాలుగా మారాయి. ఈ నేపథ్యంలో ఈ సమస్యను అదిగమించేందుకు ఆంధ్రవిశ్వవిద్యాలయం ముందస్తు విజన్‌తో ముందుకు సాగుతొంది. ఈ రంగంలో క్రీయాశీలక అనుభవం ఉన్న అవంతీ సీఫుడ్స్ సంస్థతో ప్రత్యేక అవగాహన ఒప్పందం ద్వారా ఏయూ విద్యార్థులను నైపుణ్యం దిశగా నడిపిస్తోంది. ఇందులో బాగంగానే ఏయూలో అవంతి ఆక్వా కల్చర్ స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఏర్పాటు జరిగింది. ఏయూ సూచన మేరకు అవంతి ఫీడ్స్ ద్వారా చైర్మన్ అల్లూరి ఇంద్ర కుమార్ రూ.కోట్లు వ్యయంతో ఈ సెంటర్‌ను ఏర్పాటు చేసి విద్యార్థులకు అవసరమైన శిక్షణను అందిస్తున్నారు. సంస్థ డైరెక్టర్ ఏకే రెడ్డి ఈ సెంటర్ కార్యకలాపాలను పర్యవేక్షిస్తున్నారు.





## అల్లూరి సేవలకు.. గుర్తింపు



అవంతీ ఫీడ్స్ లిమిటెడ్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ అల్లూరి ఇంద్రకుమార్ గత కొన్నేళ్లుగా ఏయూ విద్యార్థుల నైపుణ్యానికి బాటులు వేస్తున్నారు. ఆయనకు ఆక్వాల్చర్ రంగంలో 30 ఏళ్లు అనుభవం ఉంది. ష్రింప్ ఫీడ్ మ్యానుఫాక్చరింగ్, హేచరీస్, ఫామ్స్, ప్రోసెసింగ్ రంగంలో ఇంద్ర కుమార్ విశిష్ట సేవలు అందిస్తున్నారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బులిటీలో భాగంగా ఏయూలో ' ఏయూ - అవంతి ఆక్వాకల్చర్ స్కిల్ డవలప్‌మెంట్ సెంటర్' పేరిట ప్రత్యేక సెంటర్‌ను నెలకొల్పి విద్యార్థుల్లో నైపుణ్యం పెంపుకు బాటలు వేస్తున్నారు. ఏయూ విద్యార్థులకు నైపుణ్య శిక్షణతో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారు. దీంతో ఆక్వారంగంలో ఆయన సాధించిన ఖ్యాతికి గుర్తింపుగా ఆంధ్రవిశ్వవిద్యాలయం ఇటీవల ఆయన్ను గౌరవ డాక్టరేట్‌తో సత్కరించింది. సైన్స్ అండ్ టెక్నాలజీ కేటగిరిలో ఆయనకు ఈ అవార్డు అందించారు. వర్సిటీ ఉన్నతాధికారుల సమక్షంలో రాష్ట్ర గవర్నర్ డాక్టర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదగా ఆయన ఇటీవల ఈ అవార్డు అందుకున్నారు.

## ఉద్యోగం ఒడిసిపట్టేలా...

ఆక్వా కల్చర్ పరిశ్రమకు నైపుణ్యం కలిగిన మానవ వనరులను అందించడమే ఈ సెంటర్ ప్రాథమిక లక్ష్యం. ఆక్వా కల్చర్‌తో పాటు వ్యవసాయ రంగంలోని అన్ని అంశాలు నిష్ణాతులైన నిపుణులచే ఇక్కడి శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఫార్మింగ్, ప్రాసెసింగ్, హార్చేరీ అంశాల్లో ఈ సెంటర్ ద్వారా విద్యార్థులకు శిక్షణ అందిస్తున్నారు. విద్యార్థులకు నెల పాటు శిక్షణ అందిస్తున్నారు. ఇందులో భాగంగా రెండు వారాల పాటు ఆయా ఆంశాల్లో సబ్జెక్ట్‌పై అవగాహన తరగతులు నిర్వహిస్తారు. అనంతరం రెండు వారాల పాటు ఆన్‌సైట్ ప్రాక్టీస్ ఉంటుంది. ఇందులో భాగంగా కాకినాడ, కోరంగి, వెస్ట్ గోదావరికి చెందిన పలు ప్రాంతాల్లోని ఆక్వా ఫామ్‌లకు తీసుకెళ్లి చేరువుల్లోకి విడుదల చేసిన చిన్న చేపలను పెంచే విధానాన్ని ఆచరణాత్మకంగా నేర్పిస్తారు. చేపలు పెంపకానికి ఎలాంటి విధానాలు అవలంభించాలి. ఎదుగుదలలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి. ఏ సమయంలో ఎలాంటి ఫుడ్ పెట్టాలి. ఫుడ్ విషయంలో ఎలాంటి జాగ్రతులు తీసుకోవాలి, ఎలాంటి ఫుట్ ద్వారా ఉత్పత్తి వేగవంతంగా ఉంటుంది అనే అంశాలపై శిక్షణ అందిస్తారు. ఇలా శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు అవంతి ఫీడ్స్‌తో పాటు ఆక్వా కల్చర్ సంబంధిత పరిశ్రమలలో ఉద్యోగాలు కల్పిస్తున్నారు. ఇక్కడి శిక్షణ పొందిన విద్యార్థులు పలువురు సొంతంగా అక్వా కార్యకలాపాలు నెరవేర్చుకునే విధంగా ప్రోత్సహిస్తున్నారు. ఈ రంగంలో నిపుణత కలిగిన విద్యార్థులు రూ.35000-40000 జీతంతో ఉద్యోగ అవకాశాలు అందిపుచ్చుకుంటున్నారు.





## ఇదీ నైపుణ్య శిక్షణ..

కేంద్రం అందించే శిక్షణా కార్యక్రమం ఆక్వా-కల్చర్‌పై లోతైన అవగాహనతో విద్యార్థులను సన్నద్ధం చేయడానికి రూపొందించబడింది. ఈ సెంటర్ ద్వారా ఒక నెల కాల వ్యవధి లో విద్యార్థులకు శిక్షణ అందిస్తున్నారు. శిక్షణలో ఒక బ్యాచ్ కి 20 మంది విద్యార్థులను అనుమతిస్తారు. మూడు దశల్లో ఈ శిక్షణ అందిస్తున్నారు. ఫార్మింగ్, ప్రాసెసింగ్, హర్చేరీ దశల ద్వారా విద్యార్థుల్లో ప్రధానంగా నైపుణ్యాన్ని పెంచుతున్నారు. ఈ శిక్షణ పొందాటనికి విద్యార్థులు, రీసెర్చ్ స్కాలర్స్, టెక్నీషియన్స్ అర్హులు. అర్హత గల అభ్యర్థులలో బీఎస్సీ ఫిషరీస్, ఎమ్మెస్సీ ఫిషరీస్, ఆయా కోర్సుల్లో పరిశోధక విద్యార్థులు అర్హులు. ఈ కేంద్రం వారి ఫీల్డ్ శిక్షణ సమయంలో శిక్షణ పొందిన వారికి ఆహారం, వసతిని కల్పిస్తుండగా దీనికి విద్యార్థులకు నామినల్ ఛార్జ్‌ను చెల్లించాల్సివుంటుంది. ఇప్పటి వరకు ఒక్కో బ్యాచ్‌కు 20 మంది విద్యార్థులు చొప్పున ఇప్పటి వరకు ఈ సెంటర్ ద్వారా 500 మందికి పైగా విద్యార్థులకు శిక్షణ అందించడంతో పాటు ప్లేస్‌మెంట్స్ కల్పించారు.




## ఆక్వా కల్చర్ మంచి అవకాశాలు



ఆక్వా కల్చర్ సెక్టార్‌లో నైపుణ్యం కలిగిన వనరుల అభివృద్ధి చేయడంలో ఈ సెంటర్ గణనీయమైన పురోగతిని సాధిస్తోంది. ప్రస్తుతం దేశీయంగా ఈ రంగంలో నిపుణుల కొరత ఎక్కువగా ఉంది. ఈ నేపథ్యంలో అవంతి సీఫుడ్స్, ఆంధ్రవిశ్వవిద్యాలయం సంయుక్తంగా విద్యార్థుల్లో ఈ దిశగా నైపుణ్యాన్ని పెంపొందించేందుకు ఈ సెంటర్‌ను నెలకొల్పడం జరిగింది. ఆక్వా-కల్చర్ చేపల పెంపకం మాత్రమే కాదు. ఇది ప్రపంచం వ్యాప్తంగా పెరుగుతున్న సీ ఫుడ్ డిమాండ్‌కు అనుగుణంగా ఉత్పత్తిని పెంపొందించడం. పర్యావరణ స్థిరత్వాన్ని సమతుల్యం చేయడం వంటి అంశాలపై ఆదారపడి ఉంది. ఈ నేపథ్యంలో ఈ దిశగా విద్యార్థులకు పూర్తిస్థాయి శిక్షణ అందించడం జరుగుతుంది. ఆంధ్రా యూనివర్శిటీ సహకారంతో ఇక్కడ అందించే శిక్షణా కార్యక్రమాలు సమగ్రంగా, ప్రయోగాత్మకంగా ఉంటాయి. విద్యార్థులు కేవలం సబ్జెక్ట్ మాత్రమే కాకుండా పరిశ్రమల్లో సేవలకు సిద్ధంగా ఉండేలా శిక్షణ అందిస్తాం. శిక్షణ పూర్తియిన తరువాత నేరుగా పరిశ్రమల్లో సేవలందించే నైపుణ్యాన్ని పెంపొందిస్తాం.

**- డాక్టర్ ఫణి ప్రకాష్, నైపుణ్య శిక్షకుడు**

## విద్యార్థుల నైపుణ్యానికి బాటలు..



ఒక నిపుణుడిగా, ఈ సెంటర్ డైరెక్టర్‌గా శిక్షణ తీసుకుంటున్న విద్యార్థులకు సానుకూలకు ఫలితాలు వస్తున్నందుకు సంతోషం వ్యక్తం చేస్తున్నాను. ఆక్వా కల్చర్ సెంటర్ నిబద్ధత, లక్ష్యాన్ని చేరుకోవడానికి సెంటర్ ద్వారా అందించే సేవలు పూర్తి సంతృప్తికరంగా సాగుతున్నాయి. విద్యార్థులకు అన్న విధాల మెరుగైన సౌకర్యాలు సెంటర్ అందించండం జరుగుతుంది. ఈ శిక్షణ ద్వారా విభిన్న నేపథ్యాలు కలిగిన విద్యార్థులు ఆక్వా కల్చర్ రంగంలోకి ప్రవేశించడా నికి మార్గం లభిస్తుంది. దీంతో నైపుణ్యం మాత్రమే కాకుండా విద్యార్థులను ఉపాధి అవకాశాల దిశగా ముందుకు నడిపిస్తున్నాం. ఈ దిశగా ఇప్పటికే చాలా మంది విద్యార్థులు ఉన్నత ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవడం జరిగింది.

**- ఏకే రెడ్డి,** సెంటర్ డైరెక్టర్

---

# పరిశోధన రంగంలో రాణించాలి

**నూతన ఔషధాలను విద్యార్థులు అన్వేషించాలి**

**కేజీహెచ్ సూపరిండెంట్ డాక్టర్ అశోక్‌కుమార్**

**ఘనంగా ఏయూ ఫార్మా డీ విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే**

**ఏయూ న్యూస్, అక్టోబర్ :** ఫార్మా డీ కోర్సు పూర్తిచేసిన విద్యార్థులు పరిశోధన రంగంలో రాణించాలని కేజీహెచ్ సూపరిండెంట్ డాక్టర్ పి.అశోక్ కుమార్ అన్నారు. ఇటీవల ఏయూ వైవిఎస్ మూర్తి ఆడిటోరియంలో నిర్వహించిన ఫార్మా డీ విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అశోక్ కుమార్ మాట్లాడుతూ నూతన ఔషధాలు, మూలకాల అణ్వేషణ జరిపే దిశగా విద్యార్థులు కృషిచేయాలన్నారు. వ్యాధుల నివారణే లక్ష్యంగా వైద్యులతో అనుసంధానంగా పనిచేయాలన్నారు. ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ మాట్లాడుతూ డిగ్రీ పూర్తిచేసిన తరువాత సమాజానికి మనం ఏ విధంగా ఉపయోగపడగలం అనే ఆలోచను విద్యార్థులు కలిగి ఉండాలన్నారు. ప్రపంచం నిత్యం మార్పులకు లోనవుతుందని, వీటిని ఆకళింపు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తల్లిదండ్రులకు ఇచ్చే నిజమైన బహుమతిగా నేటి గ్రాడ్యుయేషన్ డే నిలుస్తుందన్నారు. సామాజిక, నైతిక విలువలను ఉప్పుడూ బాధ్యతగా తీసుకోవాలన్నారు. ఏయూ ఫార్మశీ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య వై.రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ వైద్యునికి, రోగికి మధ్య అనుసంధానంగా ఫార్మా డీ విద్యార్థుల సేవలు నిలుస్తాయన్నారు. ఏపీ డ్రగ్ కంట్రోల్ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.విజయ్ కుమార్ ఔషధాలకు సంబంధించిన చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆచార్య జి.శశిభూషణరావు, ఆచార్య కె.వి.రమణమూర్తి, ఆచార్య జి.గిరిజా శంకర్, వి.గిరిజా శాస్త్రి, ఆచార్య కె.ఈశ్వరకుమార్, ఆచార్య ఏకేఎం పవార్, డాక్టర్ శైలజ తదితరులు పాల్గొన్నారు.








## టెన్నిస్ క్రీడాకారిణికి
# వీసీ అభినందన



**ఏయూ న్యూస్, అక్టోబర్ :** జాతీయ స్థాయిలో సౌత్ జోన్ యూనివర్సిటీ పోటీల్లో ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న లాన్ టెన్నిస్ క్రీడా కారిణి కె.సాయి శ్రీ అనిషాను ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి ఇటీవల తన కార్యాలయంలో అభినందించారు. ఇటీవల నిర్వహించిన ఖేలో ఇండియా యూనివర్సిటీ పోటీల్లో అనిషా పాల్గొన్నారు. లాన్ టెన్నిస్‌లో ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఈ సందర్భంగా వీసీ ఆకాంక్షించారు. అనిషాకు హైదరాబాద్‌కు చెందిన నాట్కో ఫార్మా స్పాన్సర్‌షిప్ అందిస్తోందని ఆమె తండ్రి పరశురామ్ ఈ సందర్భంగా వీసీకి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏయూ స్పోర్ట్స్ బోర్డు డైరెక్టర్ ఆచార్య ఎన్.విజయ్‌మోహన్, ఏయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగాధిపతి ఆచార్య ఎ.పల్లవి తదితరులు పాల్గొన్నారు.

## నవంబర్‌లో భౌతికశాస్త్ర విభాగంలో
# జాతీయ సదస్సు



**ఏయూ న్యూస్, అక్టోబర్ :** ఆంధ్రవిశ్వవిద్యాలయం భౌతిక శాస్త్ర విభాగంలో నవంబరు 2 నుంచి 4వ తేదీ వరకు ద్రవ స్ఫటికాలపై నిర్వహించే మూడు రోజుల జాతీయ సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సదస్సుకు శాస్త్రవేత్తలు, పరిశోధకులు 250 మందికిపైగా హాజరై తమ పరిశోధన పత్రాలను సమర్పిస్తారన్నారు. విదేశాల నుంచి పలువురు శాస్త్రవేత్తలు తమ పరిశోధన పత్రాలను సమర్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి డిఎస్‌టి సహకారం అందిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సదస్సు ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆచార్య కె.బసవయ్య, కన్వీనర్ డాక్టర్ రామకృష్ణ నాంచారరావు, భౌతిక శాస్త్ర విభాగాధిపతి ఆచార్య ఎస్.శ్రీనివాసరావు, ఆచార్య ఎన్.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఏయూ రిజిస్ట్రార్‌ను అభినందించిన
# ఏపీ సీఐడీ చీఫ్ సంజయ్



**ఏయూ న్యూస్, అక్టోబర్ :** ఆంధ్రవిశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా అదనపు బాధ్యతలు స్వీకరించిన ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్‌ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రైం ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్ (సిఐడి) చీఫ్ ఎన్.సంజయ్ అభినందించారు. ఇటీవల అమరావతిలోని తన కార్యాలయంలో ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్‌ను అభినందించి, శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రతిష్టాత్మక ఆంధ్ర విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా బాధ్యతలను చేపట్టడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆచార్య స్టీఫెన్‌ను సత్కరించారు. పరిపాలనా దక్షత, ఉన్నత విద్యార్హతలు కలిగిన ఆచార్య స్టీఫెన్‌కు రిజిస్ట్రార్‌గా బాధ్యతలు అప్పగించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తన కార్యాలయంలోని ఇతర అధికారులకు ఆచార్య స్టీఫెన్‌ని స్వయంగా పరిచయం చేరు. ఆంధ్రవిశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థిగా తాను ఎల్లప్పుడూ ఏయూ ప్రగతిని తెలుసుకోవడం జరుగుతుందని సీఐడీ చీఫ్ ఎన్.సంజయ్ అన్నారు. నేడు ఆంధ్రవిశ్వవిద్యాలయం నూతన ఆలోచనలతో పనిచేస్తున్న విధానం, వీసీ ఆచార్య ప్రసాద రెడ్డి దార్శినిక పనితీరును అభినందించారు. శతాబ్దానికి చేరువవుతున్న ఏయూను మరింత ఉన్నతంగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు.

# ప్లాస్టిక్ కాలుష్యాన్ని నిరోధించాలి






**ఏయూ న్యూస్, అక్టోబర్ :** ఆంధ్రవిశ్వ విద్యాలయం మెరైన్ లివింగ్ రిసోర్సెస్ విభాగం ఆధ్వర్యంలో మైక్రో ప్లాస్టిక్స్ ఇన్ మెరైన్ ఎన్విరాన్‌మెంట్ అంశంపై మూడు రోజుల శిక్షణ తరగతులు ఇటీవల ముగిసాయి. ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత ముగింపు సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆచార్య కె.సమత మాట్లాడుతూ ప్లాస్టిక్ కాలుష్యాన్ని తగ్గించే విధంగా ప్రతి ఒక్కరు సూచించారు. ప్లాస్టిక్ కాలుష్యం ఫలితంగా సముద్ర జీవులకు ఎదురవుతున్న ఇబ్బందులను వివరించారు. యూరోపియన్ కమీషన్ అందించిన ప్రాజెక్టులో భాగంగా ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మొత్తం 25 మంది పరిశోధకులు, అధ్యాపకులు, సహాయ ఆచార్యులు, మత్స్యశాఖ, జీవీఎంసీ అధికారులు ఈ శిక్షణకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య పి.జానకీరామ్, డాక్టర్ కె.ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

# ఇమ్యుకాన్ 2023 సదస్సుకు హాజరైన డాక్టర్ అపరంజి




**ఏయూ న్యూస్, అక్టోబర్ :** ఆంధ్రవిశ్వవిద్యాలయం బయోకెమిస్ట్రీ విభాగ అధ్యాపకురాలు డాక్టర్ పి.అపరంజి న్యూఢిల్లీలో జరిగిన ఇమ్యుకాన్ 2023 సదస్సులో పాల్గొన్నారు. ఈ నెల 5 నుంచి 8వ తేదీ వరకు జరిగిన ఈ జాతీయ సదస్సుకు ఆమె హాజరయ్యారు. ఇండియన్ ఇమ్యునాలజీ సొసైటీ గోల్డెన్ జూబ్లీ ఇయర్ సమావేశంగా దీన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ అపరంజి ఒక సైంటిఫిక్ సెషన్‌కి ఛైర్మన్‌గా వ్యవహరించారు. దీంతో సదస్సులో ఏయూ ప్రాతినిధ్యం పట్ల నిర్వాహకులు సంతోషం వ్యక్తం చేశారు. ఇమ్యునాలజీ రంగంలో చేస్తున్న సేవలను గుర్తిస్తూ సదస్సు నిర్వాహకులు డాక్టర్ అపరంజికి సత్కరించి, జ్ఞాపికను బహూకరించారు. ఈ నేపథ్యంలో ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డిని ఇటీవల ఆయని కార్యాలయంలో కలిసి సదస్సు వివరాలను వెల్లడించారు. దీంతో సదస్సులో ఏయూకు ప్రాతినిధ్యం వహించడం పట్ల డాక్టర్ పి.అపరంజిను వీసీ అభినందించారు. ప్రపంచ వ్యాప్తంగా ఇమ్యునాలజీ రంగంలో పనిచేస్తున్న నిపుణులు ఈ సదస్సులో పాల్గొన్నారని డాక్టర్ అపరంజి వివరించారు.




# యూబీఏను పూర్తిస్థాయిలో అమలు చేయాలి

**ఏయూ న్యూస్, అక్టోబర్ :** ఉన్నత్ భారత్ అభియాన్ (యూబీఏ) కార్యక్రమాన్ని ఏయూ అనుబంధ కళాశాలల్లో పూర్తి స్థాయిలో అమలు చేయాలని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాద రెడ్డి సూచించారు. ఇటీవల తన కార్యాలయంలో యూబీఏ రీజినల్ కో ఆర్డినేటింగ్ ఇన్స్టిట్యూట్-ఏయూ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి అవార్డులను ప్రధానం చేశారు. పలు విభాగాల్లో ఉత్తమ కళాశాలలుగా ఎస్ఆర్ఆర్ ఇంజినీరింగ్ కళాశాల, ఉత్తమ ఏక్టివిస్ట్‌గా ఏయూ-ఐఏఎస్ఈ, ఉత్తమ మోటివేటర్‌గా జీఎంఆర్ఐటీ, ఉత్తమ ఇనీషియేటర్గా ఎస్.కోట ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఉత్తమ ఎస్ఈజీ ప్రపోజనల్‌గా అనిట్స్ కళాశాల, ఉత్తమ హెల్పర్‌గా బాలాజీ డిగ్రీ కళాశాల, అమెురా్ప్ విశ్వ విద్యాలయం స్పెషల్ జ్యూరీ జీఎస్ఎల్ దంత కళాశాల, సర్ సీఆర్ఆర్ మహిళా కళాశాల అధ్యాపకులకు అవార్డులు, ప్రశంసా పత్రాలను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఐఏఎస్ఈ ప్రిన్సిపాల్ ఆచార్య టి.శోభశ్రీ, యూబీఏ నోడల్ అధికారి ఆచార్య జి.నాగరాజు, ప్రాంతీయ సమన్వయకర్త బి.పావని తదితరులు పాల్గొన్నారు.

# జీ20 కనెక్ట్‌తో.. జాతీయ గుర్తింపు

రాష్ట్రానికి ప్రతినిధ్యం వహించిన ఏయూ విద్యార్థులు

ఆర్ఐఎస్ డీజీతో ప్రత్యేక భేటి

ఆంధ్ర విశ్వవిద్యాలయ విద్యార్థులకు అద్భుతమైన అవకాశం దక్కింది. రాష్ట్రంలో ఏ ఇతర విశ్వవిద్యాలయానికి లేని విధంగా ప్రతిష్టాత్మక జీ-20 సమావేశంలో పాల్గొనేందుకు ఆహ్వానం లభించింది. ఈ ఏడాది జీ-20 సమ్మెట్‌కు భారత్ ప్రాతినిధ్యం వహించిన విషయం తెలిసిందే. ఈ సమ్మెట్‌లో భాగంగా ఢిల్లీ వేదికగా నిర్వహించిన "జీ-20 యూనివర్సిటీ కనెక్ట్"లో ఏయూ విద్యార్థులకు భాగస్వామ్యం లభించింది. వీసీ ఆచార్య ప్రసాద్ రెడ్డి సూచనలతో 22 మంది విద్యార్థులతో కూడిన వర్సిటీ బృందం ఈ కార్యక్రమానికి హాజరైంది. ఈ బృందానికి ఏయూ పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగాధిపతి ఆచార్య జి.వీర్రాజు ప్రాతినిధ్యం వహించారు. పర్యటన ముగించుకొని ఇటీవల వర్సిటీకి తిరిగి వచ్చిన ఈ విద్యార్థుల బృందం ఆ సమావేశ అనుభవాలను ఇలా ఏయూ లుక్స్‌తో పంచుకుంది.

## యూనివర్సిటీ కనెక్ట్ జరిగిందిలా..

ప్రతిష్టాత్మక జీ-20 సమావేశాలకు ఈ ఏడాది భారత్ అతిధ్యం ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ సమావేశాల్లో భాగంగా ముగింపు కార్యక్రమాల్లో "జీ-20 యూనివర్శిటీ కనెక్ట్" పేరిట దేశంలోని విశ్వవిద్యాలయాల విద్యార్థులను భాగస్వాములను చేస్తూ ఢిల్లీ వేదికగా ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దేశవ్యాప్తంగా పలు ప్రతిష్టాత్మక విశ్వవిద్యాలయాలకు ఆహ్వానం లభించగా మన రాష్ట్రం నుంచి ఆంధ్రవిశ్వవిద్యాలయానికి ఈ ఆహ్వానం దక్కింది. దీంతో వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి సూచనల మేరకు ఏయూకు చెందిన 22 మంది విద్యార్థుల బృందం ఈ సమావేశంలో పాల్గొంది. ఇందులో పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగానికి చెందిన 21 మంది విద్యార్థులు , సైకాలజీ విభాగానికి చెందిన 1 విద్యార్థి భాగస్వాములయ్యారు. ఈ బృందానికి పోటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగాధిపతి ఆచార్య జి.వీర్రాజు ప్రాతినిధ్యం వహించారు. ఢిల్లీ ప్రగతి మైదానం లోనీ భారత మండపంలో ఈ "G-20 యూనివర్సిటీ కనెక్ట్" కార్యక్రమం జరిగతింది. దేశవ్యాప్తంగా 70 విశ్వ విద్యాలయా లకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. కేంద్ర విద్యాశాఖ, నైపుణ్యాభివృద్ధి శాఖల మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, భారత విదేశాంగ మంత్రి జైశంకర్, యూజీసీ ఛైర్మన్ మామిడాల జగదీష్ కుమార్ తదితరులు దేశంలో జరిగిన G-20 విజయవంతమైనట్లు తెలిపారు. దేశంలో చోటు చేసుకున్న వినూత్న మార్పులు, విద్యార్థుల భవిష్యత్తు కార్య చరణలపై సూచనలు అందించారు. దేశ ప్రధాని మంత్రి నరేంద్ర మోడీ మాట్లాడుతూ "నా బలం భారత యువతే" అనీ ప్రసంగాన్ని ప్రారంభిస్తూ యువతలో స్ఫూరి నింపారు. స్థిరమైన అభివృద్ధి, నైపుణ్య ప్రగతి, యూపీఐ డిజిటల్ చెల్లింపులు తీసుకొచ్చిన మార్పులను, కేంద్ర సహకారంతో స్టార్టప్‌ల అభివృద్ధి లను వివరిచారు. అనంతరం దేశ ప్రగతిలో యువత ఎలా భాగస్వాము లు కావాలనే విషయంపై మార్గనిర్దేశం చేశారు. దీంతో పాటు 2వ రోజు కార్యక్రమంలో భాగంగా రీసెర్చ్క అండ్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఫర్ డవలపింగ్ కంట్రీస్ డైరెక్టర్ జనరల్ సచిన్ చతుర్వేది ఏయూతో పాటు మైసూర్, ఉస్మానియా, అన్నా యూనివర్సిటీలతో ప్రత్యేకంగా ఇంట్రాక్ట్ అయ్యారు. ఈ సందర్భం గా గత మార్చిలో ఏయూ నిర్వహించిన జీ20 సన్నాహక సదస్సు అద్భుతంగా జరిగిందన్నారు. దేశంలో మరే వర్సిటీ ఇంత అద్భుతస్థాయిలో ఈ సదస్సు నిర్వహించలేదని కొనియాడారు. అందుకు ఏయూ వీ.సీ ప్రసాద్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ ఇంట్రక్షన్ భాగంగా ఆర్.ఐ.ఎస్ ఉన్నతాధికారు లు మెరైన్ బయాలజీ, నైపుణ్య, స్థిరమైన అభివృద్ధి, వాతావరణ మార్పులు వంటి అంశాలపై చర్చించారు. ఏయూలో జియో పాలిటిక్స్ విభాగం ప్రారంభిస్తే బాగుంటుందని సూచించారు.



మొలక శంకర్, సీహెచ్ రూప కామేశ్వరి
ఏయూ జర్నలిజం విభాగ సీనియర్ విద్యార్థులు

## జాతీయస్థాయిలో గుర్తింపు లభించింది



జీ20 యూవన్సిటీ కనెక్ట్‌లో పాల్గొనడం ద్వారా మన విశ్వవిద్యాయానికి, విద్యార్థులకు జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు లభించింది. భవిష్యత్ విజన్‌పై ప్రధాని నరేంద్రమోడి చేసిన దిశానిర్దేశం యువతను ఆకట్టుకుంది. ఆయనతో పాటు విదేశాంగ మంతి జైశంకర్, కేంద్ర విద్యాశాఖ మంత్రులు విలువైన మార్గనిర్దేశం చేశారు. యూజీసీ ఛైర్మన్, ఆర్ఐఎస్ ఉన్నతాధికారులు మన విద్యార్థులతో ప్రత్యేకంగా ఇంట్రాక్ట్ అవ్వడం జరిగింది. ఈ ఇంట్రాక్షన్‌లో విద్యార్థులు అందించిన సమాధానాలకు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై ఏయూ అందిస్తున్న సేవలను ఆసక్తిగా తెలుసుకున్నారు. జీ20 సన్నాహక సదస్సును ఏయూ అద్భుతంగా నిర్వహించిందంటూ కొనియాడారు. దీంతో పాటు విద్యార్థులు ఢిల్లీతో పాటు పరిసర ప్రాంతాలను వీక్షించేందుకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించారు.

– ఆచార్య జి.వీర్రాజు, విభాగాధిపతి



## అద్భుత అవకాశంగా భావిస్తున్నాను



ఇంతటి అద్భుత అవకాశం నాకు లభిస్తుందని నేను కలలో కూడా ఊహించలేదు. నేను విద్యాభ్యాసం అభ్యసిస్తున్నప్పుడే ఇలాంటి శిఖరాగ్ర సదస్సు జరగడం, అందులో పాల్గొనే అవకాశం లభించడం నిజంగా అదృష్టంగా భావిస్తున్నారు. దేశ భవిష్యత్ అభివృద్ధి, విద్యార్థుల లక్ష్యలపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అద్భుతమైన మార్గనిర్దేశం చేశారు. మాకు ఇలాంటి అవకాశం కల్పించిన ఏయూ వీసీ సార్‌కు, వర్సిటీ ఉన్నతాధికారులకు నా కృతజ్ఞతలు.

– జీ.ఎస్తేర్, విద్యార్థిని

## సందేశాలు స్ఫూర్తినిచ్చాయి



జీ 20 శిఖరాగ్ర సదస్సులో ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో పాటు ఇతర ముఖ్య వక్తల సందేశాలు స్ఫూర్తినిచ్చాయి. స్థిర, నైపుణ్య అభివృద్ధి, యూపీఐ తీసుకువచ్చిన విప్లవాత్మక మార్పుల గురించి చేసిన ప్రసంగం ఎంతో ఆకట్టుకున్నాయి. నా విద్యాభ్యాసంలో నైపుణ్య అభివృద్ధిపై దృష్టి సారించేందుకు అనుగుణంగా ప్రేరణ కలిగింది. ముఖ్యంగా యువతలో నైపుణ్య అభివృద్ధి మెరుగుపడాలని, మనం విద్య అభ్యసించేటప్పుడు నైపుణ్యాలు పెంచుకోవాలని పీఎం పేర్కొన్నారు. అందుకు అనుగుణంగా నా విద్య దశలో నైపుణ్యాలు నేర్చుకోవాలని నిర్ణయించుకున్నాను.

– షేక్ నసర్

## ఉన్నత లక్ష్యంపై స్ఫూర్తి కలిగింది



ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఉన్నతాధికారుల వర్కింగ్ స్టైల్ నన్ను ఎంతగానో ఆకట్టుకున్నాయి. వారి మాటతీరు. విజనరీ ఆలోచనలు, ఎదుటివారు వారికి ఇచ్చే గౌరవం, పనిపట్ల అంకితభావం, దేశాభివృద్ధిలో భాగస్వామిగా నిలవాలనే వారి తపన వంటివెన్నో అక్కడ నేను గమనించడం జరిగింది. దీంతో ఆ క్షణం నా మనసులో ఒకటే నిర్ణయించుకున్నాను. భవిష్యత్‌లో నేను కూడా సివిల్స్ సాధించి వారిలాగే దేశానికి, దేశ ప్రజలకు సేవచేయాలని నిర్ణయించుకున్నాను. ఈ దిశగా నా ప్రయత్నాలు కొనసాగిస్తాను.

– కె.సాహిత్ కుమార్, విద్యార్థి

# ఈ వారం డాక్టరేట్లు

## అరుణరెడ్డికి ఏయూ డాక్టరేట్



**ఏయూ న్యూస్, సెప్టెంబర్ :** ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిశోధక విద్యార్థిని అరుణరెడ్డికి డాక్టరేట్ లభించింది. ఏయూ ఎడ్యుకేషన్ విభాగంలో ' ఏ స్టడీ ఆఫ్ టెక్నోఫోబియా ఇన్ ద యూజ్ ఆఫ్ ఐసిటి ఎమాంగ్ సెకండరీ స్కూల్ టీచర్స్ ఇన్ విజయనగరం డిస్ట్రిక్ట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్' అనే అంశంపై చేసిన పరిశోధనలకు గాను ఆంధ్ర విశ్వవిద్యాలయం ఈ డాక్టరేట్‌ను ప్రధానం చేసింది. ఇటీవల ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి చేతుల మీదగా అరుణరెడ్డి వీసీ కార్యాలయంలో ఈ డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. ఆచార్య టి.షారోనురాజు పర్యవేక్షణలో అరుణరెడ్డి పరిశోధనలు సాగాయి. ఈ సందర్భంగా వర్సిటీ ఉన్నతాధికారులు, పలువురు వర్సిటీ ఆచార్యులు, పరిశోధకులు అరుణరెడ్డికి అభినందనలు తెలియజేశారు.

## కళాగ్రేస్‌కు ఏయూ డాక్టరేట్



**ఏయూ న్యూస్, సెప్టెంబర్ :** ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిశోధక విద్యార్థిని లంకపల్లి కళాగ్రేస్‌కు డాక్టరేట్ లభించింది. ఏయూ ఇన్విరాన్మెంటల్ సైన్సస్ విభాగంలో ' రీప్రొడక్టివ్ ఎకోలాజీ ఆఫ్ సీపాడెస్సా బాసిఫెరా, వాల్‌సురా ట్రీపోలియాటా అండ్ సీజీయమ్ కుమిని ఇన్ ద ట్రిపికల్ డెసిడ్యుయోస్ ఫారెస్ట్స్ ఆఫ్ ఈస్ట్రాన్ ఘాట్స్ ఆఫ్ ఏపీ, ఇండియా ' అనే అంశంపై చేసిన పరిశోధనలకు గాను ఆంధ్ర విశ్వవిద్యాలయం ఈ డాక్టరేట్‌ను ప్రధానం చేసింది. ఇటీవల ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి చేతుల మీదగా కళాగ్రేస్ వీసీ కార్యాలయంలో ఈ డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. ఆచార్య ఏజే సాల్మన్‌రాజు పర్యవేక్షణలో కళాగ్రేస్ పరిశోధనలు సాగాయి. ఈ సందర్భంగా వర్సిటీ ఉన్నతాధికారులు, ఆచార్యులు, పరిశోధకులు ఆమెకు అభినందనలు తెలియజేశారు.

## బాస్కరలక్ష్మికి ఏయూ డాక్టరేట్



**ఏయూ న్యూస్, సెప్టెంబర్ :** ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిశోధక విద్యార్థి వి.బాస్కరలక్ష్మి వై కి డాక్టరేట్ లభించింది. ఏయూ ఇనుస్ట్రుమెంట్ టెక్నాలజీ విభాగంలో ' స్టడీస్ ఆన్ ఆప్టికల్ అండ్ ఎలక్ట్రికల్ ప్రోపర్టీస్ ఆఫ్ ఏ ట్రాన్స్పరెంట్ ఎలక్ట్రోడ్ ఫర్ సోలార్ సెల్ యూజింగ్ గ్రీన్ సైంథసైజిడ్ జింక్ స్టాన్నటే అండ్ మ్యాగ్జిమమ్ ఫ్లోరైడ్ నానో పార్టికల్స్' అనే అంశంపై చేసిన పరిశోధనలకు గాను ఆంధ్ర విశ్వవిద్యాలయం ఈ డాక్టరేట్‌ను ప్రధానం చేసింది. ఇటీవల ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి చేతుల మీదగా బాస్కరలక్ష్మి వీసీ కార్యాలయంలో ఈ డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. ఆచార్య వై.శ్రీనివాసరావు, డాక్టర్ స్వప్నల పర్యవేక్షణలో బాస్కరలక్ష్మి పరిశోధనలు సాగాయి. ఈ సందర్భంగా వర్సిటీ ఉన్నతాధికారులు, పలువురు వర్సిటీ ఆచార్యులు, పరిశోధకులు బాస్కరలక్ష్మికి అభినందనలు తెలియజేశారు.

## బాలల ఆత్మహత్యలపై అధ్యయనం చేయండి



**ఏయూన్యూస్, అక్టోబర్:** రాష్ట్రంలోని బాలల ఆత్మహత్యల పరిస్థితులపై ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో అధ్యయనం నిర్వహించాలని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఛైర్మన్ కేస అప్పారావు కోరారు. ఈ మేరకు ఇటీవల ఆంధ్ర విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య ప్రసాదరెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఆత్మహత్యలు, యువత మత్తు పదార్థాలను వినియోగిస్తూ జీవితాన్ని నాశనం చేసుకుంటున్న ఘటనలపై ఏయూ సోషల్ వర్క్ విభాగంలో ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విద్యార్థు లతో క్షేత్ర స్థాయిలో అధ్యయనం చేయాలని వీసీని కోరారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ దేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న విశాఖ నగరంలో బాలలు మత్తు పదార్థాలను తీసుకుంటూ, చెడు స్నేహాలను అలవాటు చేసుకొని బంగారు భవిష్యత్తును అంధకారంలోకి నెట్టుకుంటున్నట్లు కమిషన్ దృష్టికి వచ్చిందన్నారు. వీటి నివారణకు సంబంధిత అధికారులు, సచ్ఛంద సేవా సంస్థలతో కలిసి రాష్ట్ర వ్యాప్తంగా ఒక బృహత్తర కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. మరి కొందరు బాలలు క్షణికావేశంలో బలవన్మరణాలు, ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని వీటిని నివారించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ నేపథ్యంలో ప్రతిష్టాత్మక ఆంధ్ర విశ్వవిద్యాలయం ఈ మహా క్రతువులో భాగస్వామిగా నిలవాలని ఆకాంక్షించారు.

## దేశ సమైక్యతను పెంచేందుకే నా దేశం-నా మట్టి




**ఏయూ న్యూస్, అక్టోబర్ :** ఆంధ్ర విశ్వవిద్యాలయంలో జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్) విద్యార్థుల ఆధ్వర్యంలో నా దేశం నా మట్టి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి ముఖ్యఅ తిథిగా పాల్గొని ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వర్సిటీ నుంచి సేకరించిన మట్టిని విద్యార్థుల సమక్షంలో అమృత కలశంలో వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం దేశ పౌరుల్లో దేశభక్తి, సమైక్యతను పెంచేలా నిలుస్తోందన్నారు. ప్రజలంతా ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భాగస్వాములు కావాలని సూచించారు. ఎన్ఎస్ఎస్ విద్యార్థులు వివిధ ప్రాంతాల నుంచి మట్టిని సేకరించి ఢిల్లీకి పంపుతున్నారు. ఈ కార్యక్రమంలో ఏయూ ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ ఆచార్య హరినాథ్, ప్రోగ్రాం అధికారిణి శైలజ తదితరులు పాల్గొన్నారు.

## బహుభాషా కోవిదుడు ఆచార్య జోస్యుల నివాళి

**ఏయూన్యూస్, అక్టోబర్:** బహు భాషా కోవిదుడు ఆచార్యులు జోస్యుల సూర్య ప్రకాశరావుకు ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగు విభాగం ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ఏయూ తెలుగు విభాగంలో తెలుగు శాఖాధిపతి జర్రా అప్పారావు అధ్యక్షతన ఇటీవల జోస్యుల సూర్యప్రకాశరావు సంస్మరణ సభను నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం విశ్రాంత ఆచార్యులు జి.యోహాను బాబు మాట్లాడుతూ జోస్యుల సూర్యప్రకాశ రావు ఏయూ తెలుగు విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉద్యోగ జీవితం ప్రారంభించి వార్డెన్ గా, ఎన్.ఎస్.ఎస్ అధికారిగా పనిచేసి ఆ పదవులకే వన్నె తెచ్చారన్నారు. బహుభాషా కోవిదుడుగా పేరొందిన ఆయన అటు సంస్కృతం, తెలుగు, హిందీతో పాటు 12 భాషలలో పట్టు సాధించారన్నారు. ఆయన స్ఫూర్తితో నేటి యువత భాషా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. కార్యక్ర మంలో ఆచార్య బూసి వెంకటస్వామి, ఎ. సీతారత్నం ఎ. ఈశ్వరమ్మ, కట్టిపోగు రత్న నివాళి శేఖర్, పెండ్యాల లావణ్య, ఎ. వెంకటేశ్వర్లు, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.




## ఫిజిక్స్ విభాగంలో రెస్ట్‌రూమ్‌ల ఆధునీకరణ

**ఏయూ న్యూస్, అక్టోబర్ :** ఆంధ్రవిశ్వవిద్యాలయం భౌతిక శాస్త్ర విభాగంలో దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోని రెస్ట్‌రూమ్‌లను పూర్తిస్థాయిలో ఆధునీకరించారు. ఇటీవల ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి విద్యార్థుల చేత వాటిని ప్రారంభింపజేశారు. రూ. 15 లక్షల వ్యయంతో వీటిని ఆధునీకరించారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు, విభాగాధిపతి ఆచార్య ఎస్.శ్రీనివాసరావు, విభాగ ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు. విభాగంలో పూర్తిస్థాయిలో మరమ్మత్తు లు చేపట్టడం, ఆధునిక వసతులను కల్పించడం పట్ల విద్యార్థులు అమితమైన సంతోషాన్ని వ్యక్తం చేశారు. థ్యాంక్యూ వీసీ సార్ అంటూ ప్లకార్డులతో వీసీకి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా భౌతిక శాస్త్ర విభాగంలోని సి.వి. రామన్ విగ్రహానికి అధికారులు పూలమాల వేసి నివాళులర్పించారు.



aulooks@andhrauniversity.edu.in
aulooksvizag2019@gmail.com




# విద్యతోనే మహిళా సాధికారత సాధ్యం






**ఏయూ న్యూస్, అక్టోబర్ :** విద్యతోనే మహిళా సాధికారత సాకారం అవుతుందని ఏయూ ఆర్ట్స్, కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు అన్నారు. ఇటీవల ఏయూ మహిళా అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విభిన్న రంగాలలో మహిళలు రాణించాలని సూచించారు. కేంద్ర సంచాలకురాలు డాక్టర్ పి.ఉష మాట్లాడుతూ లింగ వివక్షత, అసమానతలు. పూర్తిగా అరికట్టాల్సిన అవసరం ఉందన్నారు. బాలికలకు తమ హక్కులపై చైతన్యం, అవగాహన కల్పిస్తామన్నారు. ఈ సందర్భంగా పోస్టర్, డ్రాయింగ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో కె.సలోమి, జె.సుధారాణి, తదితరులు పాల్గొన్నారు. వారం వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో వర్సిటీ ప్రిన్సిపాల్స్, పాలక మండలి సభ్యులు, ఆచార్యులు. ప్రారంభించారు. గర్ల్ ఆఫ్ క్యాంపెయిను 2010లో యునైటెడ్ నేషన్స్ ఫౌండేషన్ శ్రీకారం చుట్టింది. 130 దేశాలలో 3500కి పైగా క్లబ్లు ప్రస్తుతం ఉన్నాయి. బాలికల అభివృద్ధికి దోహదపడే కార్యక్రమాలు నిర్వహిస్తారు. సమాన అవకాశాలు, విద్య, హక్కులు, ఆరోగ్యం, సామాజిక, ఆర్థిక అవకాశాలు. తదితర అంశాలపై వీరంతా పని చేస్తారు. ఈ కార్యక్రమంలో ఏయూ ప్రిన్సిపాల్స్ ఆచార్య వి.వి. జయలక్ష్మి, ఆచార్య టి.శోభశ్రీ, పాలక మండలి. సభ్యులు ఆచార్య దుర్గారాణి ఆచార్య పి.సునీత, ఆచార్య ఏకేఎం పవార్, ఆచార్య కె.సీతా మాణిక్యం, తదితరులు పాల్గొన్నారు.

# ఐపీఆర్ మూక్స్ కోర్సులకు విశేష స్పందన



**ఏయూ న్యూస్, అక్టోబర్:** ఆంధ్ర విశ్వ విద్యాలయం డీపీఐఐటీ-ఐపీఆర్ ఛైర్ సెంటర్ ఫర్ ఐపీఆర్ ప్రారంభించిన మేసివ్ ఓపెన్ ఆన్లైన్ కోర్సు(మూక్స్)లకు విద్యార్థుల నుంచి మంచి స్పందన లభించింది. ఏయూలో చదువుతున్న 3,500 మందికి పైగా పీజీ విద్యార్థులు ఈ కోర్సులకు దరఖాస్తు చేశారు. ఇటీవల ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాద్ రెడ్డి స్వయంగా కోర్సును విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొచ్చారు. నూతన ఎడ్యుకేషనల్ పాలసీలో భాగంగా విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచన పెంచాడానికి ఈ కోర్సును అందుబాటులోకి తెచ్చారు. ఈకార్యక్రమంలో ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, ఏయూ ఐపీఆర్ ఛైర్ ప్రొఫెసర్ డాక్టర్ హనుమంతు పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు. కోర్సు పూర్తిచేసిన వారికి రెండు క్రెడిట్లు, ఇ సర్టిఫికెట్ అందిస్తున్నారు.

# బాస్కెట్‌బాల్ పోటీలు ప్రారంభం




**ఏయూ న్యూస్, అక్టోబర్ :** అఖిల భారతీయ విద్యాభారతి అఖిల భారతీయ శిక్షా సంస్థాన్ ఆధ్వర్యంలో 34వ బాస్కెట్బాల్ చాంపియన్షిప్ పోటీలు ఏయూ గ్రౌండ్స్లో శుక్రవారం ప్రారంభమయ్యాయి. పోటీలను ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి, రాజ్యసభ సభ్యులు జీవీఎల్ నరసింహారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా జీవీఎల్ మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో సత్తాచాటాలన్నారు. ఈ జాతీయ స్థాయి పోటీలకు విశాఖ వేదిక కావడం ఆనందంగా ఉందన్నారు. మూడు రోజుల పాటు అండర్ 14,17,19 బాలబాలికలకు ఈ చాంపియన్‌షిపల్లో బాలురలో 28. బాలికల్లో 19 విద్యాభారతి జట్లు పోటీపడనున్నారు. ఆలిండియా విద్యాకేంద్రం ప్రెసిడెంట్ రామాకృష్ణారావు, బీవీకే డైర్మన్ పీఎస్ అవధాని, నిర్వాహక కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# హాస్టల్ మెస్‌ను పరిశీలించిన రిజిస్ట్రార్






## భోజన నాణ్యత స్వయంగా పరిశీలన
## విద్యార్థులతో మాట్లాడి వారి సూచనలు స్వీకరణ




**ఏయూ న్యూస్, అక్టోబర్ :** ఆంధ్రవిశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు హాస్టల్‌ని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజన నాణ్యతను పరిశీలించారు. స్వయంగా విద్యార్థులతో కలసి భోజనం చేసారు. విద్యార్థులకు అందిస్తున్న భోజం నాణ్యత తెలుసుకున్నారు. భోజనం వండటానికి సరఫరా చేసే వస్తువుల నాణ్యత నుంచి వండి, వడ్డించే వరకు తీసుకుంటున్న చర్యలను ఆయన గమనించారు. వస్తువుల సరఫరా విషయంలో ఎటువంటి రాజీ పడవద్దని అధికారులకు ఆదేశించారు. విద్యార్థులకు ఆరోగ్యకరమైన, రుచికరమైన ఆహారాన్ని అందించే విధంగా సిబ్బంది పనిచేయాలన్నారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులనుంచి పలు సూచనలు ఆయన స్వీకరించారు. మెస్‌లలో నాణ్యత ప్రమాణాలను మరింత పెంపుదల చేసే విధంగా కృషిచేస్తామన్నారు. విద్యార్థులు నేరుగా తమ దృష్టికి వారి సమస్యలను తీసుకురావచ్చునని చెప్పారు. కార్యక్రమంలో చీఫ్ వార్డెన్ డాక్టర్ జి.వీర్రాజు, డాక్టర్ కె.శ్రీమన్నారాయణ, డాక్టర్ ఎస్.హరనాథ్ తదితరులు పాల్గొన్నారు.

# ఏయూలో గర్ల్ అప్ కార్యక్రమం ప్రారంభం




**ఏయూ న్యూస్, అక్టోబర్ :** యువతులను సాధికారత దిశగా నడిపిస్తూ, లింగ సమానత్వానికి పనిచేసే గర్ల్ అప్ కార్యక్రమం ఏయూలో ఇటీవల ప్రారంభమైంది. యునైటెడ్ నేషన్స్ ప్రారంభించిన ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ఏయూలో ప్రారంభించారు. ఇంజనీరింగ్ కళాశాల వై.వి.ఎన్ మూర్తి ఆడిటోరియంలో ఏయూ ప్రిన్సిపాల్స్, పాలక మండలి సభ్యులు, ఆచార్యులు, విద్యార్థుల సమక్షంలో ఈ కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. గర్ల్ అప్ క్యాంపెయిన్ని యునైటెడ్ నేషన్స్ ఫౌండేషన్ 2010లో ప్రారంభించింది. నేడు ప్రపంచ వ్యాప్తంగా 3500 క్లబ్లు 120 దేశాలలో ఏర్పాటు అయ్యాయి. గర్ల్ అప్ కార్యక్రమంలో సమాన అవకాశాలు, విద్య, ఆరోగ్యం, సామాజిక, ఆర్థిక అవకాశాలు, స్వేచ్ఛ జీవనం, హింస రహితంగా జీవించడం తదితర అంశాలపై పనిచేస్తుంది. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ ఆచార్య వి. విజయలక్ష్మి, ఎస్.కె భట్టి, టి. శోభశ్రీ, పాలక మండలి సభ్యులు ఆచార్య కె.దుర్గారాణి, పి.సునీత, పి.కె.ఎం పవార్ తదితరులు పాల్గొన్నారు.




# రిజిస్ట్రార్‌ను అభినందించిన ఎమ్మెల్సీ

**ఏయూ న్యూస్, అక్టోబర్ :** ఆంధ్రవిశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా అదనపు బాధ్యతలు చేపట్టిన అంబేద్కర్ చైర్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.జేమ్స్ స్టీఫెన్‌ని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పి.రఘు వర్మ అభినందించారు. గురువారం ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి, రిజిస్ట్రార్ ఎం.జేమ్స్ స్టీఫెన్‌లను ఆయన మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగ ఏయూలో జరుగుతున్న అభివృద్ధి ప్రాజెక్టులను ఆయన అడిగి తెలుసుకున్నారు. అనంతరం నూతనంగా రిజిస్ట్రార్‌గా బాధ్యతలు చేపట్టిన జేమ్స్ స్టీఫెన్‌ని ఎమ్మెల్సీ రఘు వర్మ సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు.

# మహిళ వసతి గృహంలో ప్రవేశాల కోలాహలం

## ఏయూ మహారాణిపేట మహిళ వసతి గృహంలో ప్రవేశాల సందడి

## తొలి విడతలో 500 మంది విద్యార్థినీలకు వసతి



## అన్ని రకాల సౌకర్యాలు కల్పించాం.. వార్డెన్ ఆచార్య పల్లవి



2023-2025 విద్యా సంవత్సరం ప్రవేశాలకు సంబంధించి ఏపీ పీజీసెట్ ద్వారా ఆంధ్ర యూనివర్సిటీలో సీట్లు పొందిన విద్యార్థులు మహారాణిపేట మహిళా వసతి గృహానికి పెద్ద ఎత్తున తరలివచ్చారు. వారి ప్రవేశాలతో నేపధ్యంలో వసతి గృహంలో కోలాహల వాతావరణం నెలకొంది. ఈ ప్రవేశాల నేపధ్యంలో తల్లిదండ్రులు, విద్యార్థుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు చీఫ్ వార్డెన్ ఆచార్య ఏ.పల్లవి వెల్లడించారు. హాస్టల్ సిబ్బంది, మేట్రిన్స్ వారికి అవరసమైన సలహాలు అందిస్తూ ప్రవేశాలు కల్పించినట్లు తెలిపారు. మహారాణిపేట మహిళా వసతి గృహంలో మొత్తం బ్లాకులకు సంబంధించి 280 గదులు అందుబాటులో ఉన్నాయన్నారు. వీటిలో ఇప్పటికే 340 మంది సీనియర్ విద్యార్థులు ఉండగా ఈ విద్యా సంవత్సరంలో తొలి విడత సీట్లు పొందిన 500 మందికి ఇప్పటి వరకు వసతి కల్పించినట్లు తెలిపారు. వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి సార్ సూచనలతో వసతిగృహాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దినట్లు ఆచార్య ఏ.పల్లవి తెలిపారు. వసతి గృహంలో జిమ్ ఫెసిలిటీ, రీడింగ్ హాల్‌తో పాటు పచ్చని చెట్లతో కూడిన ఆహ్లాదకర వాతావరణంతో అన్ని రకాల సౌకర్యాలు కల్పించినట్లు వెల్లడించారు. విద్యార్థులకు ఆరోగ్యకరమైన, రుచికరమైన ఆహారాన్ని అందించడం జరుగుతోందన్నారు. అనంతరం వర్సిటీలో సీట్లు పొందిన పలువురు విద్యార్థులు, వారి తల్లిదండ్రులూ యూనివర్సిటీలో ప్రవేశంతో పాటు హాస్టల్‌లో కల్పిస్తున్న సౌకర్యాలపై వారి అనుభూతులను ఏయూ లుక్స్‌తో పంచుకున్నారు.

### సౌకర్యాలన్ని బాగుతున్నాయి



నేను భద్రాచలం నుండి వచ్చాను. నాకు ఏయూ ఫైన్ ఆర్ట్స్ డిపార్ట్మెంట్లో సీటు వచ్చింది. ఆంధ్ర యూనివర్సిటీలో విద్యా విధానం చాలా బాగుంటుందని విని యూనివర్సిటీలో చదవాలని కలలు కన్నాను. కష్టపడి సీటు సంపాదించి నా కల నెరవేర్చుకున్నాను. యూనివర్సిటీ వాతావరణం చాలా ప్రశాంతంగా ఉంది. వసతిగృహంలో సౌకర్యాలన్నీ బాగున్నాయి.

**- ఎస్. రేణుక, విద్యార్థిని**

### చాలా ఆనందంగా ఉంది



నేను కర్నూలు నుంచి వచ్చాను. నాకు ఫిజికల్ కెమిస్ట్రీలో సీటు వచ్చింది. నాకు ఆంధ్ర యూనివర్సిటీలో సీటు రావడం పట్ల చాలా ఆనందంగా ఉంది. నేను భవిష్యత్తులో పీహెచ్‌డీ చేయడానికి ప్రస్తుత వర్సిటీ చదువు సహకరిస్తుందని ఆశిస్తున్నాను. వసతిగృహ వాతావరణము అంతా బాగుంది. మా ప్రవేశానికి వసతిగృహ చీఫ్ వార్డెన్‌తో పాటు హాస్టల్ సిబ్బంది మాకు అన్ని విధాల సహకారం అందించారు.

**- జి.లత, విద్యార్థిని**

### భవిష్యత్‌పై నమ్మకం కలిగింది



మా అమ్మాయికి ఆంధ్ర యూనివర్సిటీలో సీట్ రావడం మాకు ఆనందాన్నిచ్చింది. వర్సిటీతో పాటు హాస్టల్‌లోనూ ప్రశాంత వాతావరణం ఉంది. విద్యార్థుల స్నేహపూర్వక నడవడిక నాకు నచ్చింది. చదువుకోడానికి వీలుగా పిల్లలకు అన్ని సౌకర్యాలు కల్పించారు. ఇక్కడ చదువుకోవడం ద్వారా మా అమ్మాయి భవిష్యత్ ఉన్నతంగా ఉంటుందని భావిస్తున్నాను. **- ఎస్.భద్రయ్య, విద్యార్థిని తండ్రి**

### సొంతింటిని తలపించింది



దశాబ్దాలుగా లక్షల మంది విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించిన ఘనత కలిగిన ఈ యూనివర్సిటీలో మా అమ్మాయికి సీటు రావడం పట్ల చాలా సంతోషంగా ఉంది. యూనివర్సిటీ వాతావరణం చాలా బాగుంది. వసతి గృహ వాతావరణం సొంతింటిని తలపించింది. ఇక్కడ చదవడం ద్వారా మా అమ్మయికి మంచి జరుగుతుందని ఆశిస్తున్నాను **- జి.పంపాపతి, విద్యార్థిని తండ్రి**

### స్నేహపూర్వక వాతావరణం నచ్చింది



నేను ఎవరితోను ఎక్కువ కలిసి ఉండలేను. అలాంటిది ఇక్కడ ఇంత మందిలో కలిసి ఉండటం నాకు చాలా నచ్చింది. అందరి అలవాట్లు, అభిరుచులు తెలుసుకుంటున్నాను. మంచి స్నేహపూర్వక వాతావరణం ఇక్కడ ఉంది. అందుకే ఈ హాస్టల్ నాకు కొత్తదనాన్ని ఇచ్చింది. నా రూమ్మేట్స్ బాగా చూసుకుంటున్నారు. హాస్టల్‌లో సీనియర్స్ రాగింగ్ అనే ప్రసక్తే లేదు. వార్డెన్లు చాలా ఫ్రెండ్లీగా ఉంటున్నారు. హాస్టల్ లో చెట్లు, మొక్కలు ఎక్కువగా ఉండటం వలన చక్కటి గాలి, ప్రశాంతత చాలా ఆకర్షణీయంగా ఉంది. బయట ఏ హాస్టల్ లో లేని జిమ్ ఫెసిలిట ీకూడా ఇక్కడ ఉండటం ఆనందాన్ని ఇచ్చింది. దీంతో ఆంధ్రవిశ్వవిద్యాలయంలో సీటు రావడం అదృష్టంగా భావిస్తున్నారు.

**- ప్రభాషిణి, విద్యార్థిని**

### నాకు ఇదోక కొత్త అనుభూతి



నేను అమలాపురం నుంచి వచ్చాను. జీవితంలో మొదటిసారి హాస్టల్‌లో ఉంటున్నాను. అందుకే నాకు ఇది కొత్త అనుభూతి. ఆంధ్ర యూనివర్సిటీలో ఎంబీఏ సీటు దొరకటం నా అదృష్టంగా భావిస్తున్నాను. యూనివర్సిటీ హాస్టల్ ఇంత అద్భుతంగా ఉంటుందని నేను ఊహించలేదు. నేను హాస్టల్ లో జాయిన్ అయ్యి నాలుగు రోజులైంది. ఇక్కడి వాతావరణానికి నాకు ఏటువంటి బెంగ లేదు. హాస్టల్ అడ్మిషన్ కి వచ్చినప్పుడు తొలిరోజు మా పేరెంట్స్ తిరిగి వెళ్ళలేకపోవటంతో వారికి కూడా ఆ రోజు వసతి కల్పించారు. చీఫ్ వార్డెన్ ఆచార్య పల్లవి మేడం చాలా స్నేహ భావంతో గైడ్ చేస్తారు. హాస్టల్ భోజనం మేము ఊహించిన దానికన్నా చాలా బాగుంది. ఎలాంటి అనారోగ్యాలు రాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

**- లలిత, విద్యార్థిని**

### అమ్మనాన్నలు ధైర్యంగా వెళ్లారు



నేను ఎంఏ హిస్టరీలో ప్రవేశం పొందడం జరిగింది. ఏడు గంటలు ప్రయాణం చేస్తేగాని మా ఇంటికి చేరుకోలేని పరిస్థితి. డిగ్రీ చదువులో మాదిరిగా వసతిగృహం ఉంటుందని భావించాను. కానీ ఏయూ మహిళ వసతిగృహం అందుకు విర్ధుంగా ఉంది. ఇక్కడి సౌకర్యాలు ఇంటిపై బెంగపెట్టుకునేలా లేవు. ఇక్కడ అన్ని రకాల సౌకర్యాలు ఉన్నాయి. హాస్టల్‌లో శుద్ధమైన త్రాగునీరు అందిస్తున్నారు. హాస్టల్‌లో భద్రతా సిబ్బంది నిత్యం అప్రమత్తంగా ఉంటున్నారు. వాష్ రూమ్స్ ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తున్నారు. దీంతో ఇక్కడ నేను భద్రంగా ఉన్నాను. నా తల్లదండ్రులు నన్ను విడిచిపెట్టి ధైర్యంగా ఇంటికి వెళ్లారు. మా పెదనాన్న ఆంధ్ర విశ్వవిద్యాలయంలో చదువుకున్నారు. ఆయన స్పూర్తితోనే నేను వర్సిటీలో చేరడం జరిగింది.

**- మహిమ కుమారి, విద్యార్థిని**

Chief Patron Prof. P.V.G.D. Prasada Reddy, Chief Editor Prof K.Samatha, Publisher Prof V. Krishna Mohan, Chief Advisor Prof James Stephen, Technical Adviser D.Sivakumar Reddy, Editorial Team Dr. Challa Rama Krishna, Prof. D.Lalitha Bhaskari, Dr. T.Vijaya Lakshmi, Mr. V.V.S.V Narasimham, Dr. Ch. Satyanarayana, Andhra University South Campus, Visakhapatnam, Andhra Pradesh, India, Pin: 530 003, Phone : 0891-284422